# సముద్రానికి కన్నీటి తర్పణాలు

-రేణుక అయోల

అక్కడ నుంచి ఫోను రావడం పదోసారి, ఇంక బాగోదని తప్పకుండా వస్తానని ఫోను పెట్టేశాను. 'అమృత్ సదన్' నుంచి వరుసగా నాలుగు రోజుల నుండీ ఫోన్ కాల్స్ వస్తూనే ఉన్నాయి రవికి. "మీ అమ్మగారు స్థాపించిన 'అమృత్ సేవాసదన్' పదవ వార్షికోత్సవానికి మీరు తప్పకుండా రావాలి. మీరు మీ శ్రీమతిని కూడా తీసుకురండి. మీ అమ్మగారు మాకు దూరమైన దగ్గర నుంచి మేము చాలా బాధపడుతున్నాం, ఆవిడ వర్ధంతి, పదవ వార్షికోత్సవం కలిపి వచ్చాయి" అంటూ ఫోనులో వేడుకుంటూ రమ్మని బలవంతం చేశారు కాంతమ్మగారు.

నాకు అమ్మ మీద కోపం ఉందా? కోపం కాదు బాధ. ఏం తప్పు చేశామని మమ్మల్ని వదిలి వెళ్లిపోయిందని అక్కసు. అర్ధాంతరంగా ఇల్లు వదిలి వెళ్లవలసిన అవసరం ఏమిటి? అసలు ఎందుకు అలా మారిపోయింది. ఇంట్లో అత్తా కోడళ్లు కొట్లాటలు అసలు లేవు. ఇద్దరూ స్నేహితుల్లా ఉండేవారు. మొదటి నుంచీ అమ్మ స్వభావం వేరుగా ఉండేది. ఇతరులని అర్థం చేసుకోవడం, అందరికీ సహాయం చేయడం అలవాటు. అందుకు నాన్నగారి సహకారం కూడా ఉండేది.

అమ్మానాన్న ఇద్దరూ ఒకేమాట మీద నిలబడేవారు. ఒక్క కొడుకునని ఏనాడు అతి గారాబంగా పెంచలేదు. మనిషికి డబ్బు కన్నా మానవత్వానికే ఎక్కువ విలువ ఇచ్చిన వ్యక్తులు. అలాంటి అమ్మ ఎందుకు మారిపోయింది?

తల్లీ తండ్రి ఇద్దరినీ పోగొట్టుకొని అన్నా వదినల పంచన ఉంటూ ఎన్నో ఇబ్బందులకి గురి అయిన ఇందిరని కాని కట్నం లేకుండా కోడలుగా తెచ్చుకున్నారు. లోకానికి కోడలు అని చెబితే కానీ తెలియనంతగా కలిసిపోయారు.

నేను, ఇందు ఇద్దరం ఉద్యోగస్థులం.

"మా అత్తగారు ఒక్క క్షణం కనిపించకపోతే తోచదు. ఆవిడ వల్లే నేను ఇంత స్వేచ్ఛగా ఉంటున్నాను. ఇంత నిశ్చింతగా ఉద్యోగం చేస్తున్నాను" అని అందరికీ ఆప్యాయంగా చెప్పేది ఇందిర.

పెద్దవాడు కిరణ్ పుట్టాక, నాన్నగారు హఠాత్తుగా పోయారు. ఆ షాక్‌ని అమ్మ తట్టుకోలేకపోయింది. మళ్లీ మామూలు మనిషిని చేయడానికి ఇందిర ఎంతో కృషి చేసింది. నాన్న మీద దిగులుతో డీలా పడిపోయిన అమ్మకోసం, ఎంతో తపన పడింది ఇందిర...

అప్పుడే హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ అయింది. స్థలం మార్పు వల్ల మెల్లగా కోలుకుంది. ఇందిరకి ట్రాన్స్‌ఫర్ అవడం చాలా ఆలస్యం అయింది, అప్పుడు కూడా నా దగ్గరికి రాకుండా ఇందిర దగ్గరే ఉండిపోయింది. అలాంటి అమ్మ ఎందుకు మారిపోయింది? ఎప్పుడో కర్మన్‌ఘాట్‌లో కొన్న స్థలంలో తానే ఒక ఆశ్రమాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పి ఇల్లు విడిచి వెళ్లిపోయింది. ఎందుకు వెళ్లిపోయిందో అర్థం కాక ఇద్దరం చాలా బాధపడ్డాం.

"ఎంతగా ప్రేమించాను ఆవిడని, ఎప్పుడూ అత్తగారిలా అనుకోలేదు. ఆవిడ కూడా ఏనాడు ఆ భావం కనబడలేదు. అందరూ మీ అత్తగారు ఎందుకు వెళ్లిపోయింది, మొదట్లో అంతా బాగానే ఉంటారు... అంటూ ఏవేవో మాటలు అంటుంటే భరించలేక పోతున్నానండీ'' అంటూ ఇందు నా దగ్గర ఏడ్చినప్పుడు ఎలా ఓదార్చాలో అర్థం కాలేదు. రెండోది ఉష పుట్టాక, పుట్టక మునుపు మా ఇద్దరి పాట్లు దేవుడికే తెలియాలి. రోజుకో పని పిల్ల, ఉష పెద్దదయ్యేదాకా ఇందిర నేను ఉక్కిరిబిక్కిరి అయిపోయాం.

మధ్యమధ్యలో పేపర్లలో "అమృత సేవాసదన్'' గురించి, అమ్మ దాని గురించి పడుతున్న శ్రమ గురించి, అందులో ఉన్న వారిని ఎలా ఆదుకుంటుందో లాంటి వార్తలు వింటూ చదువుతున్నప్పుడల్లా ఇద్దరం బాధపడేవాళ్లం.

ఏ కారణం లేకుండా మా ఇద్దర్ని, మనమల్ని వదిలేసి వెళ్లిపోయిన అమ్మని తలచుకొన్నప్పుడల్లా దుఃఖం, కోపం వచ్చేది. అక్కడికి వెళ్లాక కనీసం ఫోను కూడా చెయ్యలేదు. అసలు మేము ఉన్నామో లేమో కూడా ఆవిడకి అక్కరలేకపోయింది. సభలు, సన్మానాలు, పొగడ్తలు. ఒకసారి వస్తానన్నా నన్ను కూడా రావద్దని కబురు పంపింది.

పోయిన సంవత్సరం ఆ సంస్థ వాళ్ల దగ్గర నుంచి ఫోను వచ్చింది, "మీ అమ్మగారు ఈ ప్రపంచంలో లేరని, వచ్చి చూడవలసింది''గా చెప్పారు.

ఇద్దరం చూడడానికి వెళ్లాం, హాస్పిటల్‌లోనే మరణించింది. నిశ్చలంగా పడుకొన్నట్లుగా ఉంది. బాగా చిక్కిపోయింది, ఎంతో చక్కటి మనిషి, కృంగిపోయినట్లుగా అయిపోయింది. శవాన్ని కూడా ఆశ్రమం వాళ్లే దహనం చెయ్యాలని కోరిందట... ఆ రోజంతా ఇద్దరం విపరీతంగా బాధపడ్డాము... అంత అపకారం ఏం చేశామని?

మెల్లగా మరచిపోతున్న అమ్మ జ్ఞాపకాలు, మళ్లీ ఆవిడ ఫోనుతో తేనెతుట్టలా కదిలాయి. ఇంటి ముందు కారు ఆగగానే ఆలోచనల నుంచి తేరుకున్నాను. కారుని బయటే పార్క్ చేసి లోపలికి వచ్చాను. "ఇందు రడీగా ఉన్నావా?''

"ఎందుకోనండీ రావాలనిపించటం లేదు, కానీ కాంతమ్మగారు ఎన్నోసార్లు ఫోను చేశారు, ఇంక బాగుండదు, ఆవిడ మనకి ఏం చేసింది అన్నది మన ఇద్దరికీ తెలుసు, లోకానికి ఆవిడ చాలా మంచి ఆవిడ, అన్నిసార్లు పిలిచినా రాలేదు అన్న నింద మనకెందుకు, పదండి వెళదాం'' అంటూ కాఫీ కప్పు చేతికిచ్చి తయారవ్వడానికి లోపలికి వెళ్లింది. అదే మొదటిసారిగా చూడడం 'అమృత సేవాసదన్'ని. చుట్టూతా పచ్చని చెట్లు, అందులో అన్నీ పూరిగుడిసెలే, శుభ్రంగా అలికి ముగ్గులు పెట్టారు. అన్నింటి కన్నా కొంచెం పెద్దగా ఉన్న గుడిసె ఆఫీస్ అనుకుంటాను. మమ్మల్ని చూడగానే ఆప్యాయంగా పరుగులాంటి నడకతో వచ్చి "రండి రండి'' అంటూ అభిమానంగా లోపలికి తీసుకువెళ్లారు కాంతమ్మగారు.

అక్కడున్న ఆడవాళ్లు, పిల్లలు కన్నీటిధారలతో అమ్మ ఫోటోకి నమస్కరిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. అమ్మవల్లే ఇంత తిండి ఈ రోజు తినగలుగుతున్నామని గుర్తు చేసుకున్నారు. మధ్యాహ్నం భోజనాలు చేసి బయలుదేరబోతుంటే, కాంతమ్మగారు చేతిలో ఒక కవరు పెట్టి "ఇది మీ అమ్మగారు

ఆవిడ చనిపోయిన తరువాత మీకు ఇమ్మన్నారు'' అంటూ తెల్లటి కవరు ఇచ్చారు. అందరి దగ్గర సెలవు తీసుకొని బయలుదేరాం.

"చూశారా! మనిషికి కావల్సింది కీర్తి, ఆదర్శాలు, అభిమతాలు అంటారే గానీ, పొగడ్తలకి లొంగని వాళ్లు ఎవరు చెప్పండి... పోనీలెండి మన దగ్గర మన పిల్లలకి చాకిరీ చేస్తూ, ఆ స్థలం డబ్బులు మనకి ఇస్తే ఏమొస్తుంది'' అంది ఇందిర బాధతో కూడిన కోపంతో. రాత్రి పడుకోబోయే ముందు గుర్తుకొచ్చింది అమ్మ ఇచ్చిన కవరు, కారులోనే ఉండిపోయింది. కవరు తెచ్చి విప్పగానే తెలిసింది. అమ్మ చాలా పెద్ద ఉత్తరం రాసిందని.

"చిన్నా రవీ'' అంటూ మొదలుపెట్టింది. నన్నెప్పుడూ "చిన్నా'' అని పిలిచేది. "నా మీద నీకు, ఇందిరకి చాలా కోపం ఉందని తెలుసు, కానీ ఏం చెయ్యను? నాకు ఒంట్లో బాగోలేనప్పుడు... గుర్తుందా డాక్టరు కొన్ని ఇంజెక్షన్లు రాసిచ్చి చేయించుకోమన్నాడు. అప్పుడు ఈపాటి దానికి పెద్ద హాస్పిటల్ ఎందుకు అని దగ్గరగా ఉన్న హాస్పిటల్‌లో చేయించుకున్నాను. ఆ తరువాత కొన్నాళ్ల దాకా తెలియలేదు, ఎందుకో నెలల తరబడి జలుబు వేధించేది గుర్తుందా? ఆమధ్య మామయ్యగారి ఇంటికి వెళ్లినపుడు వాడే 'ఎందుకైనా మంచిదక్కా ఏదీ నెలల తరబడి రాకూడదు.




పెద్ద హాస్పిటల్‌లో ఒకసారి మంచి డాక్టరుకి చూపించుకోమన్నాడు.' అప్పుడే సరిగ్గా ఇందిరకి రెండోది కడుపులో పడింది. ఆ వార్త విని ఎంత సంతోషించానో, అత్తాకోడళ్లం ఇద్దరం ఎన్నో కబుర్లు చెప్పుకొన్నాం. ఆడపిల్ల పుట్టాలని, దానికి ఏ పేరు పెట్టాలో కూడా నిర్ణయించుకున్నాం.

ఆ మర్నాడు జలుబు ఇంకా ఎక్కువైపోయింది, తలనొప్పి కూడా భరించలేకపోయాను. ఇంక లాభం లేదని, పెద్ద హాస్పిటల్‌కి వెళ్లాను. ఆ డాక్టరుకి ఏదో అనుమానం వచ్చింది. కొన్ని పరీక్షలు చేయించుకోమన్నాడు. తీరా రిపోర్టులు వచ్చాక మర్నాడు డాక్టరు పిడుగులాంటి వార్త చెప్పాడు. నాకు హెచ్.ఐ.వి. వచ్చిందని. భూమి బద్దలైనట్లు అనిపించింది. సిగ్గుతో, బాధతో చితికిపోయాను. డాక్టరు అడిగిన ప్రశ్నలకి ఏం జవాబు చెప్పాలో అర్థం కాలేదు. మనసంతా మొద్దుబారిపోయింది. ఇంటికి రావాలనిపించలేదు. మర్నాడు డాక్టరు దగ్గరికి వెళ్లినపుడు "ఇది అంటువ్యాధి కాదు, ఇంట్లో వాళ్లకి నచ్చచెప్పి మందులు తీసుకోండి'' అని ఎన్నో విధాలుగా ధైర్యం చెప్పారు.



## తిరిగి దక్షిణాదికి...

బద్రి, నరసింహుడు... తెలుగు చిత్రాల్లో నటించిన అమీషా పటేల్‌కి బాలీవుడ్‌లో ఇప్పుడు చెప్పుకోదగిన ఆఫర్లు లేకపోవడంతో తిరిగి దక్షిణాదిన తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకుంటోంది. అందులో భాగంగానే తన మకాంని ముంబాయి నుంచి చెన్నయ్‌కి మార్చాలని ఆలోచిస్తోందని ఆమె సన్నిహితుల అంటున్నారు. తెలుగు, తమిళ సినిమాల్లో చాన్సుల కోసం ప్రయత్నాలు మొదలెడుతోందని సినీజనాలు అంటున్నారు. చూద్దాం...మరి అమీషా అదృష్టం ఎలా వుందో?




అయినా తెలియని మనోవ్యథ, డాక్టరు ముందే ఏడ్చేశానురా, ఏం చెయ్యనురా ఇంజెక్షన్ల ద్వారా వచ్చినదానికి... ఏ తప్పు చేయకపోయినా బలి అయిపోయానురా. మీతో ఎలా చెప్పాలి, ముఖ్యంగా కోడలితో ఏమని చెప్పుకోను, ఈ విషయం తెలిస్తే ఎన్నెన్ని అనుమానాలు, అసలు దీనికన్నా భయంకరమైన అంటువ్యాధులు ఉన్నాయి. కానీ ఈ జబ్బు కొచ్చినంత చెడ్డపేరు దేనికీ రాలేదు. ఎన్ని రాత్రిళ్లు కుమిలిపోయానో మీకేం తెలుసు. దానికి తోడు కిరణ్, నన్ను పట్టుకొని వదిలేవాడు కాదు. వాడికి అన్నం పెట్టాలన్నా దగ్గరికి తీసుకోవాలన్నా భయపడి చచ్చిపోయేదాన్ని. ఆ చంటివాడు నా ఒళ్లో కూర్చుని ఎన్ని ముద్దులు పెట్టేవాడో, ఒళ్లో బాంబులు పెట్టుకొని ఆ చంటివాడ్ని చంపేస్తున్నట్లుగా నరకం అనుభవించానురా. నా పరిస్థితి అంతా వివరించి ఏం చెయ్యాలో తెలియటం లేదని మళ్లీ డాక్టరు దగ్గర ఏడ్చాను. అప్పుడే డాక్టర్ కాంతమ్మగారిని పరిచయం చేశారు.

ఆవిడ ఓ ఇల్లు అద్దెకు తీసుకొని ఇలా హెచ్.ఐ.వి.తో బాధపడుతున్న ఆడవాళ్లని, పిల్లలని చేరదీసి, వాళ్లతో చేతి పనులు చేయించి వాటిని అమ్మి వాళ్లకి ఉపాధి కల్పిస్తుందట. అద్దెకిచ్చిన వాళ్లకి ఎలా తెలిసిందో వీళ్లంతా ఎయిడ్స్ వచ్చిన వాళ్లని, రాత్రికి రాత్రే సామాన్లని, పిల్లల్ని, ఆడవాళ్లని రోడ్డుమీదకి తరిమేశారు. ఆవిడ ఏడుస్తూ చెబుతుంటే కన్నీరు ఆగలేదు.

ఆవిడకి ఎలాంటి జబ్బు లేకపోయినా, సమాజంలో వెలివేయబడ్డ అభాగ్యులను చేరదీసి వాళ్ల కోసం పాటుపడుతున్న కాంతమ్మగారిని చూసి జ్ఞానోదయం అయినట్లు అనిపించింది. అప్పుడే నిర్ణయించుకొన్నాను. మీ నాన్నగారు కొన్న ఆ స్థలం ఖాళీగా ఉంది. ఎప్పటికైనా మంచి ధర రావచ్చు, అయినా నా నిర్ణయం మారలేదు. ఆ మర్నాడు మీకు చెప్పి స్థలం కాగితాలు, కొంత డబ్బు తీసుకొని వెళ్లిపోయాను. మిమ్మల్ని చూడడానికి కూడా రావద్దన్నాను గుండె రాయి చేసుకుని. అక్కడ ఉన్నన్నాళ్లు చచ్చి బతికానురా, శరీరం మాత్రమే వాళ్ల కోసం శ్రమించేది. మీ కోసం మనవల కోసం ఎంత బాధపడేదాన్నో... మిమ్మల్ని చూడాలని తపించిపోయేదాన్ని.

ఆ ఖాళీ స్థలంలో గుడిసెలు వేయించాను. అందరికీ తిండి కోసం సామాన్లు కొన్నాను. ఆ తరువాత వాళ్ల చేత అల్లికలు, కుట్లు, ఎన్నో రకాల చేతి పనులు చేయించి, బజారులో అమ్మేవాళ్లం. వాటి మీద వచ్చిన ఆదాయంతో మందులు ఇప్పించేవాళ్లం. సమాజంలో కలవలేనందుకు అనుక్షణం కుమిలిపోయేవారు. లోకం నుంచి వెలివేయబడ్డ వాళ్లని చూస్తే జాలి వేసేదిరా. వాళ్లు వధ్య శిల మీద ఉన్న జీవచ్ఛవాలురా... నన్ను మన్నించరా రవీ, నీకు ఆ భగవంతుడు తిండికి, బట్టకి లోటు చెయ్యలేదు కాబట్టి ఈ ఉత్తరం చదివి నీకు వీళ్ల మీద దయ కలిగితే వాళ్లకి ఏడాదికి ఒక్కసారి బియ్యం, పప్పులు పంపించరా. అందుకే నేను చనిపోయాక ఈ ఉత్తరం నీకు ఇమ్మన్నాను. బతికి ఉండి నీ ముఖం చూడలేకపోయానురా... చనిపోయే ముందు మిమ్మల్ని అందర్నీ చూడాలని తపించిపోయాను. ఇందిరకు పుట్టిన చిన్నదాన్ని చూడాలని వేగిపోయాను. ఇందిర చాలా మంచి అమ్మాయి. ఇద్దరూ కలకాలం సుఖంగా ఉండండి... మీ అందరికీ నా ఆశీస్సులు...''

అమ్మా

కన్నీళ్లు ధారాపాతంగా చెంపల మీద నుంచి జారిపోతున్నాయి. కడుపులో నుంచి దుఃఖం, తన్నుకురాగా అప్పుడు ఏడ్చాడు రవి వెక్కి వెక్కి 'అమ్మా' అంటూ.ఇంకా పడుకోలేదేమిటా అని అనుకుంటూ చూడడానికి వచ్చిన ఇందిరకి, కింద పడేసి ఉన్న కాగితాలని, మోకాళ్ల మధ్య తల పెట్టుకొని ఏడుస్తున్న భర్తని చూసి కంగారుపడిపోయింది. ఉత్తరం పూర్తిగా చదివిన ఇందిర భర్తను ఓదారుస్తూ లేవదీసింది. ఇద్దరూ ఒకరినొకరు ఓదార్చుకున్నట్లుగా తనివితీరా ఏడ్చారు.చాలు... మహాసముద్రం లాంటి ఆవేదన ఆరడానికి వేదనతో రగులుకుపోయిన ఆత్మకి ఆ కన్నీటి తర్పణాలు చాలు.

★